ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రూ.693.13 కోట్లు విడుదల చేయండి


- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాకు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణకు రావల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైద్యారోగ్య రంగంపై తెలంగాణ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను కేంద్ర మంత్రికి వివరించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలన్నింటిని తాము ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నడ్డాకు తెలియజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ 5,159 బస్తీ దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) సమర్థంగా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, ఎన్‌హెచ్‌ఎం బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎన్‌హెచ్‌ఎం 2023-24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని,

2024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.138 కోట్లు మంజురు చేయాల్సి ఉందని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఎన్‌హెచ్‌ఎం కింద చేపట్టిన మౌలిక వసతులు, నిర్వహణ కాంపోనెంట్ కింద 2023-2024 సంవత్సరానికి సంబంధించి రావల్సిన రూ.231.40 కోట్లు తక్షణమే రీయింబర్స్ చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023, అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.



కేంద్ర మంత్రి జెపి నడ్డాకు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులివ్వండి
- కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రితో సీతక్క భేటీ

పంచాయతీ భవనాలకు నిధులు కేటాయించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేవప్రభాకర్ ం శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో సీతక్క సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి కి, గ్రామీణ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావటంలో కేంద్ర మంత్రి అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. గ్రామ పంచాయతీల ద్వారా వికేంద్రీకృత పాలనను ప్రోత్సహించడంలో తెలంగాణ ముందంజలో ఉందని సీతక్క గుర్తు చేసారు. గ్రామ స్థాయిలో ప్రజా సేవలను మెరుగుపరచడం కోసం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను పెంపొందించడం కోసం గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాల అవసరాన్ని నొక్కి చెప్పారు. తెలంగాణలోని 32 జిల్లాల్లోని 540 గ్రామీణ మండలాల పరిధిలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 6176 గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు లేవని సీతక్క గుర్తు చేశారు. తాత్కాలిక ఏర్పాట్లతో అద్దె భవనాల్లో గ్రామ పంచాయతీలు పూర్తిస్థాయిలో విధులను నిర్వర్తించలేకపోతున్నాయని మంత్రి సీతక్క నివేదించారు. అందుకే 6176 గ్రామపంచాతీల్లో శాశ్వత భవనాల నిర్మాణం కోసం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద ఒక్కో భవనానికి రూ. 25 లక్షల చొప్పున మొత్తం రూ.1544 కోట్ల నిధులను మంజూరు చేయాలని కేంద్రమంత్రికి సీతక్క విజ్ఞప్తి చేశారు. సీతక్క విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి..తెలంగాణలోని గ్రామ పంచాయతీల శాశ్వత భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజురుకు హామీ ఇచ్చారు.

ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా

- జులై 4 నుంచి తొలివిడత ప్రారంభం
- 6 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 15 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- సవరణ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా పడింది. వచ్చేనెల నాలుగు నుంచి ఎప్‌సెట్ ఇంజనీరింగ్ ప్రవేశాల తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల నాలుగు నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు మూడు విడతల్లో ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. జులై నాలుగు నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల ఆరు నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. అదేనెల ఎనిమిది నుంచి 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. అదేనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల 19 నుంచి 23 వరకు ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని అభ్యర్థులకు సూచించారు.

వచ్చేనెల 26 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని బుర్రా వెంకటేశం తెలిపారు. అదేరోజు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియను చేపట్టేందుకు అవకాశముందని వివరించారు. అదేనెల 27న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. వచ్చేనెల 27, 28 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని కోరారు. అదేనెల 31న రెండో విడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల 31 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. నాలుగో తేదీన విద్యార్థుల ప్రవేశాల వివరాలను కాలేజీ యాజమాన్యాలు అప్‌డేట్ చేయాలని కోరారు.

ఆగస్టు 8 నుంచి తుదివిడత కౌన్సెలింగ్

ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం ఆగస్టు ఎనిమిదో తేదీ నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామని బుర్రా వెంకటేశం తెలిపారు. అదేరోజు ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. అదేనెల తొమ్మిదిన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల తొమ్మిది, పది తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని తెలిపారు. ఆగస్టు 13న తుదివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల 13 నుంచి 15 వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. 16, 17 తేదీల్లో అభ్యర్థులకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. అదేనెల 21, 22 తేదీల్లో కేంద్రీకృత అంతర్గత స్లైడింగ్ (కాలేజీల్లో కోర్సులు మార్చుకోవడం) అవకాశం కల్పిస్తామని తెలిపారు. 26 సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. 27,28 తేదీల్లో వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి ఆయా కాలేజీల్లో చేరాలని సూచించారు. ఆగస్టు 28న స్పాట్ అడ్మిషన్ల కోసం మార్గదర్శకాలను విడుదల చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం www.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు ఎప్‌సెట్ ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత అభ్యర్థులకు కేటాయించిన కాలేజీల్లో భౌతికంగా రిపోర్టు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒక సెట్ జిరాక్స్ ధ్రువపత్రాలను, ఒరిజినల్ టీసీని కాలేజీల్లో సమర్పించాలని సూచించారు. రెండో విడతలో రిపోర్టు చేయకుంటే మూడో విడతలో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు.

'రైతు భరోసా' పై ప్రజాభిప్రాయ సేకరణ

- ప్రభుత్వం నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్ణయించారు. వ్యవసాయ అనుబంధ రంగాల బడ్జెట్ కేటాయింపులపై మంగళవారం సచివాలయంలో ఆశాఖ మంత్రి, అధికారులతో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమీక్షించారు.

గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలు ఏంటి.. అందుకు గల కారణాలను డిప్యూటీ సిఎం భట్టి అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వంతో మ్యాచింగ్ ద్వారా వచ్చే పథకాలు, నిధులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు తెలిపారు. పంటల బీమా లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు. రాబోయే సీజన్ కు పంటల భీమాకు సంబంధించి పిలవాల్సిన టెండర్ల పై చర్చించారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, ఇప్పటికీ కళాశాలలు లేని జిల్లాల వివరాలను డిప్యూటీ సిఎం సమావేశంలో తీసుకున్నారు. సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలలో విత్తన అభివృద్ధి తీరుపై చర్చించారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాం.. అయితే వ్యవసాయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల పైన దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సిఎం తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే ఉత్పత్తుల పెరిగి రాష్ట్ర ఖజానాకు , రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ఖజానాకు అత్యధిక ఆదాయం సమకూర్చే రంగాలు.. ప్రభుత్వం తదితర రంగాలపై చేస్తున్న ఖర్చులను డిప్యూటీ సిఎం అధికారుల ద్వారా విచారించారు. ఇక రైతు భరోసా కు సంబంధించి రైతుల అభిప్రాయం ఎలా ఉంది, ఏ విధంగా ముందుకు పోతే మంచిది అనే విషయాలను రైతుల ద్వారానే తెలుసుకుంటే మంచిదని .. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ చేసి రైతులను భాగస్వాములను చేయాలని, అందులో మంత్రులు కూడా పాల్గొంటే కార్యక్రమం మరింత ప్రయోజనాత్మకంగా ఉంటుందని ఆయన తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ కు నిధులు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు అభిప్రాయం వ్యక్తపరిచారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలకు ఇప్పటివరకు చేస్తున్న ఖర్చు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రాబోయే రోజుల్లో పెరుగుతున్న బడ్జెట్ పై సమీక్ష చేశారు. ఆయిల్ ఫామ్ సాగులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలపై చర్చించారు.

రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాలు ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో వచ్చిన మార్పులపై అధికారులను విచారించారు. సిరిసిల్ల కో-ఆపరేటివ్ సొసైటీ, టెక్స్ టైల్ వ్యాపారస్తులు ప్రభుత్వం నుంచి ఏ పద్ధతిలో ప్రయోజనం పొందుతున్నారు తదితర వివరాలు అధికారులు వివరించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, ఆర్థిక శాఖ అడిషనల్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కళాయాత్ర

- లోగోను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలుకొలుపుదాం' కళాయాత్ర లోగోను రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి నిర్వహించే ఈ కళాయాత్ర ద్వారా డ్రగ్స్ పట్ల ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించనున్నారు. 2024 జులై 1 నుండి 31 వరకు ఎగ్జిబిషన్లు, ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు కళాయాత్రలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయగా, ఆ సంఘానికి చైర్మన్‌గా మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు.

హైదరాబాద్ నగరంలో గతంలో యువకులు సరదా కోసం సిగరెట్ తాగి అలవాటు పడే వారు. ప్రస్తుతం డ్రగ్స్‌ను స్టయిల్ కోసం, గొప్పల కోసం తీసుకుంటూ బానిసలుగా మారుతున్నారు. దీంతో విలువైన జీవితాలు, వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రభుత్వం డ్రగ్స్‌ను కట్టడి చేస్తున్నా డ్రగ్స్ మాఫియా పిల్లలు తినే చాక్లెట్లలో డ్రగ్స్ కలిపి వ్యాపారం చేసేంతగా బరితెగిస్తోంది. యువత జీవితాలను, దేశ భవిష్యత్తును చీకటిలోకి నెట్టేస్తున్నది. అందుకే డ్రగ్స్ నిర్మూలనపై సమాజాన్ని మేలుకొలపడం అత్యవసరం. కళాయాత్ర పేరుతో ప్రజానాట్యమండలి హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ కాలేజీల్లో ఎగ్జిబిషన్లు, కళారూపాల ద్వారా అవగాహన కల్పించనున్నట్టు కళాకారులు, నాయకులు తెలిపారు. ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్‌గా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సినీ గేయ రచయిత అశోక్ తేజ, సినిమా హీరో డాక్టర్ మాదాల రవి, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డాక్టర్ నీలిమ, డాక్టర్ జి..యన్. రావు. ప్రముఖ దంత వైద్యులు సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి (భారత్ ఇన్‌స్టిట్యూషన్స్), పట్నం సంస్థ కార్యదర్శి డిజి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న, కోశాధికారి డి మహారాజ్ ఉన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి మల్లేష్, ఇ రఘు, సోమేశ్, పి కల్యాణ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని జిపి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుమారు 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, తమ ఇతర సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గ్రామ పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిపి కార్మికులు ధర్నా నిర్వహించి.. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో జి.వెంకటయ్య మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రిని, మంత్రి సీతక్కని ఐదుసార్లు కలిసి విన్నవించినా పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప ఆచరణలో ఒక్క సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటే కార్మికులు ఏమి తిని బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్మికుల జీవితాలకు భద్రత లేదని, మల్టీ పర్పస్ విధానం వచ్చిన తర్వాత కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో జరిగిన నిరసనలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మల్టీ పర్పస్ వర్కర్ విధానంతో జిపి ఉద్యోగులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ట్రాక్టర్, ఎలక్ట్రీషన్ నిర్వహణలో అనేక మరణాలు జరుగుతున్నాయని అన్నారు.



కెసిఆర్‌పై 2011 రైల్‌రోకో కేసు విచారణపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రైలు రోకో కేసులో.తదుపరి ఉత్తర్వుల వచ్చే వరకూ విచారణపై మంగళవారం కోర్టు స్టే విధించింది. విచారణను వచ్చే నెల 23కు వాయిదా వేసి.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2011లో రైలురోకోకు కెసిఆర్ పిలుపునివ్వడంతో కేసు నమోదైంది. ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై ఉన్న కేసు కొట్టివేయాలని కెసిఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.మరోవైపు తెలంగాణలో జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో కెసిఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కమిషన్ ఏర్పాటు సహజన్యాయ సూత్రాలకు విరుద్ధమని.. నిబంధనలమేరకేవిద్యుత్ కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని తన పిటిషన్‌లో వెల్లడించారు. విద్యుత్ కమిషన్, జస్టిస్ నర్సింహారెడ్డి, ఎనర్జీ విభాగాన్ని ప్రతివాదులుగా చేర్చారు.

రామగుండంలో ఆధునిక థర్మల్ పవర్ ప్లాంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రామగుండంలో 800 మెగావాట్ల ఆధునిక థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తామని, ఎన్నికల హామీని పూర్తి చేస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు రామగుండంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ స్టేషన్ నిర్మించాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హామీని పూర్తి చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు కోరగా డిప్యూటీ సిఎం సానుకూలంగామంగళవారం సచివాలయంలో వారు ఉప ముఖ్యమంత్రిని కలిశారు. నిజాం కాలంలో నిర్మించిన చారిత్రాత్మకమైన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌ను తిరిగి నిర్మిస్తామన్నారు. పిట్ హెడ్ ప్లాంటును సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించేందుకు అన్ని రకాల చర్యలు చేపడతామని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. ఈ మేరకు డిప్యూటీ సిఎంకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్‌రావు, రాజ్ ఠాగూర్‌సింగ్, ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను చట్టబద్ధం చేయాలి

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి
- జులై 10న ఢిల్లీలో రైతు సంఘాల సమావేశం : వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల (ఎంఎస్‌పి)ను చట్టబద్ధం చేయాలని మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో పలు రైతు సంఘాల నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 ఏడాదికి గాను కనీస మద్దతు ధరల పెంపుపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారుల మేరకు మద్దతు ధరలు దేశంలో ఇప్పటికీ అమలు కావడం లేదని వ్యాఖ్యానించారు. 2014లో అధికారంలోకి వచ్చేందుకు స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలను చెల్లిస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ఉత్పత్తి ఖర్చు, రైతుల సేవలకు అదనంగా 50 శాతాన్ని జోడించి మద్దతు ధర నిర్ణయించాలని కమిషన్ సూచిస్తే కేవలం మొదటి రెండింటిని మాత్రమే బిజెపి సర్కార్ అమలు చేసిందని విమర్శించారు. రైతు రుణమాఫీ చేయాలని 2018 నుంచి చేస్తున్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరుపేద, చిన్న, సన్నకారు రైతుల రుణాలను కాదని, పదేళ్లలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మాఫీ చేసిందని విమర్శలు గుప్పించారు. నేషనల్ క్రైం బ్యూరో రికార్డు లెక్కల ప్రకారం దేశంలో 1.9 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలను నిరోధించాలంటే కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేయనున్న రైతు రుణ మాఫీలో కేంద్రం సగం భరించాలని కోరారు. అఖిల భారత సభ జాతీయ కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ 2017లో ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులను కాల్పుల్లో చంపించిన వ్యక్తిని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా నియమిస్తే రైతులకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. వెంటనే వ్యవసాయ శాఖ మంత్రిని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పిపై కేంద్రం అనుసరించిన విధానంలో శాస్త్రీయత పూర్తిగా లోపించిందని గుర్తు చేశారు. ఫలితంగా గత పదేళ్లలో మద్దతు ధర ఆరు నుంచి ఏడు శాతం పెరిగితే, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, కూలీలు, డీజిల్ తదితర వస్తువుల ధరలు 16 నుంచి 20 శాతం పెరిగాయని తెలిపారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు పెంచితే ప్రస్తుతం వరికి క్వింటాలుకు రూ.2,183గా ఉన్న మద్దతు ధర రూ.3,150కి పెరిగేదని గుర్తు చేశారు. కేరళ సర్కార్ తరహాలో ఆహార ధాన్యాలతో పాటు పండ్లు, కూరగాయలకు సైతం మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ పోరాటాల రూపకల్పన తదితర అంశాలపై చర్చించేందుకు జులై 10న ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతు స్వరాజ్ వేదిక నాయకులు విస్సా కిరణ్, కన్నెగంటి రవి మాట్లాడుతూ ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50 శాతం జోడించి ఎంఎస్‌పీ ప్రకటించాల్సి ఉండగా, మొక్కుబడిగా ఏటా వంద, యాభై పెంచుతున్నారని ఆరోపించారు. కేంద్రం ఇప్పటికైనా మద్దతు ధరల విషయంలో పునరాలోచించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలను కౌలు రైతులకు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బి.కొండల్, జక్కుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతిజీవితం ప్రజా ఉద్యమాలకు అంకితం చేయాలి

- ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న
- కుల రహిత సమాజం కోసం పోరాడిన సామాజిక ఉపాధ్యాయులు
- ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యమాల కోసం అవిశ్రాంత సేవలు
- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్క్సిజమే మానవాళికి విముక్తి మార్గమని, ఆ మార్గం కోసం పుచ్చలపల్లి సుందరయ్య ఈ ప్రాంత మహోపాధ్యాయులు డి వెంకట్ రెడ్డి, యాదగిరి చారి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని ఎమ్మెల్సీ, ప్రజా కవి గోరటి వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం పులిజాల పరశురాములు ఉద్యోగ విరమణ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లిలో జరిగిన సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. మార్క్సిజం వల్లే తామంతా చైతన్యవంతంగా తయారయ్యామని తెలిపారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ, ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన తర్వాత అటు యూటీఎఫ్, సామాజిక సంఘమైన కేవీపీఎస్‌లో అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత బావి జీవితం ప్రజా ఉద్యమాలకు అంకితం చేయాలని సూచించారు. మార్క్సిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేసిన భూపోరాటాలతో పోతారెడ్డిపల్లిలో 40 ఎకరాలు పేదలకు పంచారని గుర్తుచేశారు. తన ఆలోచనా విధానం ఎటువైపు ఉన్నా వామపక్ష భావజాలం బలోపేతం కావాలన్నదే తన ప్రధాన ధ్యేయమని అన్నారు. యుటిఎఫ్ బలోపేతానికి సెమినార్లు నిర్వహించి ఉపాధ్యాయ లోకానికి చైతన్య స్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు.

టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, చావ రవి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ దాకా సామాజిక, ఆర్థిక పోరాటాలు చేసిన సామాజిక ఉపాధ్యాయులు పులిజాల పరశురాములు అని తెలిపారు. వంగూరు మండలం పోతారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న లింగయ్య ఎల్లమ్మల చిన్న కుమారుడు పరుశురాములు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే సామాజిక రుగ్మతలపై తనదైన శైలిలో పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలో హాస్టల్ సమస్యలు, ఫీజుల పెంపుపై విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వ విధానాలపై పోరాడారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేస్తే ప్రజల నుంచి స్పందన ఎలా ఉంటుందో పరశురాములు సన్మాన సభను చూస్తే మనకు తెలుస్తుందన్నారు. తమ మార్క్సిస్టు ఉపాధ్యాయులు యాదగిరాచారి, వెంకట్ రెడ్డి స్ఫూర్తితో ఆయన ఈ ప్రాంతంలో ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి కేటాయించే నిధులు తగ్గించి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.5 శాతం మాత్రమే కేటాయించడం చూస్తుంటే విద్యారంగం పట్ల వారికి ఉన్న ప్రేమ ఏ పాటిలో తెలుస్తుందన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యారంగానికి అత్యల్ప నిధులు కేటాయించడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 30 లక్షల ఖాళీ పోస్టుల్లో పది లక్షలు ఉపాధ్యాయ పోస్టులే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులు సైతం కృషి చేయాలని అన్నారు.ఉద్యోగ విరమణ చేసిన పరశు రాములు ప్రజా ఉద్యమాలకు అంకితం కావాలని సూచించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్, మహబూబ్‌నగర్ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రాములు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, ఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా అరాచకం

- కానిస్టేబుల్ ప్రాణాలు తీయాలని చూసిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇసుక మాఫియా ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. మొన్న వేములవాడలో మైనింగ్ ఏడీపై దాడిచేసిన సంఘటన మరువకముందే నేడు ఓ ఇసుక బకాసురుడు ఓ కానిస్టేబుల్ ప్రాణాలను తీయాలని చూశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామపూర్ గ్రామంలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను కానిస్టేబుల్ సత్యనారాయణ పట్టుకున్నాడు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు కానిస్టేబుల్ డ్రైవర్ ప్రక్కనే కూర్చొని తరలిస్తుండగా.. డ్రైవర్ ట్రాక్టర్‌ను అతి వేగంతో నడిపి ఇసుక ట్రాక్టర్‌పై నుండి కిందకు దూకేశాడు. అతి వేగంతో ఉన్న ట్రాక్టర్ చెరువులో బోల్తా పడటంతో కానిస్టేబుల్ సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ని కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

806 గ్రాముల బంగారం పట్టివేత

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం పెద్ద ఎత్తున బంగారం పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అబుదాబీ నుంచి ఒక ప్రయాణికుడు మంగళవారం తెల్లవారుజామున ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అనుమానంతో కస్టమ్స్ అధికారులు అతనితో పాటు అతని లగేజ్‌ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆయన వద్ద 806 గ్రాముల బంగారం పట్టుబడింది. దీని విలువ రూ.58.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. వెంటనే బంగారాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై చిన్నారెడ్డికి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో మొత్తం 687 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 225, గృహనిర్మాణ శాఖకు 59, పౌరసరఫరాల శాఖకు 82, హోంశాఖకు 47, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 40, ఇతర శాఖలకు సంబంధించి 234 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం అందించాలి : టిజిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెంచు మహిళ కాట్రాజ్ ఈశ్వరమ్మకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మానాయక్, ఆర్.శ్రీరాం నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను సంఘం నేతలు ఎం.ధర్మానాయక్. వి.రామ్ కుమార్, ఎ.కృష్ణా నాయక్ పరామర్శించారు. కొల్లాపూర్ నియోజకవర్గం మూలచింతలపల్లిలో నివాస ముంటున్న ఈశ్వరమ్మపై కొందరు అఘాయి త్యానికి పాల్పడ్డారని తెలిపారు. ఆ మహిళ పట్ల వారు అత్యంత దారుణంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన బండి వెంకటేశం, బండి శివ, సలేశ్వరంను కఠినంగా శిక్షించాలనీ డిమాండ్ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి-హైదరాబాద్

డ్రగ్స్ రహిత తెలంగాణ సమాజమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మాదకద్రవ్యాల రవాణాలో ఎంతటి పెద్దవారు ఉన్న ఉపేక్షించమని, ఉక్కుపాదంతో తమ ప్రభుత్వం అణచివేస్తోందన్నారు. డ్రగ్స్ రవాణా చేసే అక్రమార్కుల గుండెల్లో రైల్లు పరిగెత్తించేలా నిర్ణయాలు ఉండబోతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గౌరవ డిప్యూటీ సిఎం భట్టి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఆయన యాంటీ డ్రగ్ అవేర్నెస్ సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటి సిఎం మాట్లాడుతూ తెలంగాణలో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా అనే మాట వినబడటానికి వీలులేదని సిఎం రేవంత్ రెడ్డి, సహచర మంత్రులందరం కఠిన నిర్ణయం తీసుకొని డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలో అక్రమ రవాణా, డ్రగ్స్ నివారణకు ఎన్ని నిధులైన పోలీస్ శాఖకు కేటాయించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నేటి పిల్లలే రేపటి భవిష్యత్తు అని ఈ ప్రభుత్వం భావిస్తున్నందున డ్రగ్స్



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

నివారణకు తమ ప్రభుత్వానికి బడ్జెట్ సమస్యనే కాదన్నారు. తక్కువ సమయంలో అక్రమ పద్దతిలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలన్న దురద్దేశ్యంలో కొంత మంది దుర్మార్గులు యువతను డ్రగ్స్‌కు అలవాటు చేస్తుండగా దేశంలో బలీయంగా ఉన్న మానవవనరులను నిర్వీర్యం చేసి దేశాన్ని బలహీన పర్చాలన్న కుట్రలో భాగంగా దేశ ద్రోహులు సైతం డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నారని ఇలాంటి వారి ఉచ్చులో పడి యువత తమ బంగారు భవిష్యత్తును కోల్పోవద్దని సూచించారు. దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్సును సమూలంగా నివారించడం ప్రభుత్వం, పోలీసులతో పాటు మనందరి బాధ్యత అన్నారు.

పోలీసులు వేసే ప్రతి అడుగు మన రక్షణ కోసమే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ చాలా బలమైనది, తెలివైనదని, ఎంత దూరం వెళ్ళిన నిందితులను పట్టుకునే శక్తి సామర్థ్యాలు తెలంగాణ పోలీసులకు ఉన్నాయని అన్నారు. నగరాలకి కాకుండా గ్రామాలకు విస్తరిస్తున్న మాదకద్రవ్యాల నివారణకు అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి పోలీసులు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుంటే కట్టడి చేయడం సులభం అవుతుందని సూచించారు. ప్రశాంతంగా ఆప్యాయంగా ప్రేమగా ఉన్న కుటుంబ వ్యవస్థలో డ్రగ్స్ విష ప్రయోగం లాంటిదన్న విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు.. ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యార్థులు ఎదగడానికి ఈ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నదని వివరించారు ప్రభుత్వానికి పన్నుల నుంచి వస్తున్న ప్రతి పైసను సద్వినియోగం చేస్తూ విద్యకు ఎక్కువ మొత్తంలో వెచ్చించి మీ బంగారు భవిష్యత్తుకు తోడ్పడుతున్నామని, తాత్కాలిక వ్యసనాలకు బానిసలుగా మారితే మీ తల్లిదండ్రులతో పాటు ఈ సమాజం బాధపడుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. విద్యార్థులు, యువత మంచి సహవాసంతో నడిచి భవిష్యత్తును మార్గదర్శనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం నెక్లెస్ రోడ్డుపై విద్యార్థుల ర్యాలీని జండా ఊపి డిప్యూటీ సిఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిజిపి రవి గుప్తా, యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ సిపి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- 50 మందికి అస్వస్థత
- ఆరుగురి పరిస్థితి విషమం
- చందానగర్ మహిళా దక్షిత సమితి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీ ఆదివారం హాస్టల్‌లో ఆహారం తిన్న విద్యార్థుల్లో 50 మంది.. వాంతులు, విరోచనాలతో బాధపడ్డారు. వారిని హాస్టల్ యాజమాన్యం వెంటనే సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. 50 మందిలో ప్రస్తుతం ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇదే విషయంపై కాలేజీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. తమ దగ్గర ఎవరికీ ఫుడ్ పాయిజన్ కాలేదని తెలిపింది. మంజీరా నీటి సరఫరాలో కల్తీ నీరు సరఫరా కావడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని యాజమాన్యం చెప్పింది. కలుషిత నీటి సరఫరాపై మియాపూర్ ఏరియా వాటర్ వర్క్స్ అధికారి నాగప్రియను వివరణ కోరగా.. మంజీరా నీటి సరఫరాలో ఎలాంటి కలుషితం జరగలేదని, నీరు కలుషితం అయితే మియాపూర్ డివిజన్ పరిధిలో అంతటా జరుగుతుందని, కేవలం ఒకే చోట ఎలా జరుగుతుందని ఆమె చెప్పారు. ఇదే అంశంపై ఫుడ్ సేఫ్టీ అధికారులను వివరణ కోరగా.. తమ పరిధిలో కాలేదంటూ చేతులు దులుపుకున్నారు. ప్రధానంగా విద్యాశాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం కనబడుతోంది.

కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి
ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్

నాణ్యత ప్రమాణాలు లేకుండా నిర్వహిస్తున్న కాలేజీ, హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. సేవ పేరుతో ట్రస్టులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి

- కొంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమానాస్పదంగా ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాల కే ఫోర్ క్యాంపస్‌లోని విద్యార్థి మల్లికార్జున్ 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. అయితే మంగళవారం ఉదయం అతను ఎంతకీ నిద్ర లేవలేదు. దాంతో సిబ్బంది బాలున్ని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు అక్కడకు చేరుకుని బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మల్లికార్జున సూసైడ్ చేసుకున్నాడని.. అయితే స్కూల్ సిబ్బంది మాత్రం నామమాత్రపు మృతిగా చిత్రీకరిస్తున్నారని బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మల్లికార్జున మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఫీజులు తీసుకునే విషయంలో ఉన్న శ్రద్ధ.. విద్యార్థులకు భద్రత కల్పించే విషయంలో లేదని, ఇలాంటి యజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అవినీతి చేయలేదంటూ కౌశిక్‌రెడ్డి ప్రమాణం

- కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు సవాల్‌ను స్వీకరించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు
- మంత్రి పొన్నమూ ప్రమాణం చేయాలంటూ 'పాడి' డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి.. తాను అవినీతికి పాల్పడలేదని చెల్పూర్ ఆలయంలో ప్రమాణం చేయాలంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బావు సవాల్ చేసిన విషయం తెలిసిందే. అందుకు మంగళవారం ఆలయానికి వచ్చేందుకు సిద్ధమైన కౌశిక్‌రెడ్డిని పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. దాంతో ఇంట్లోనే తడిబట్టలతో దేవునిపై ఆయన ప్రమాణం చేశారు. మంత్రి పొన్నం కూడా అవినీతి చేయలేదని ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్య 144 సెక్షన్ విధించిన పోలీసులు ఆలయ సమీపంలో లాఠీచార్జీ చేసి ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు.

స్థానిక రైస్ మిల్లర్లు, ఇసుక మాఫియా వద్ద ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డబ్బులు వసూలు చేశారని కాంగ్రెస్



ఆంజనేయస్వామి ప్రతిమపై ప్రమాణం చేసిన కౌశిక్‌రెడ్డి

నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు విమర్శించారు. తాను పూర్తి ఆధారాలతో చెల్పూరు ఆంజనేయ స్వామి ఆలయానికి వస్తున్నానని, 'నీకు ధైర్యం ఉంటే నీవు కూడా వచ్చి డబ్బులు తీసుకోలేదని ఆంజనేయుని పై ప్రమాణం చేస్తావా?' అని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తాను చెల్పూర్‌కు మంగళవారం వస్తున్నట్టు ప్రకటించారు. ఇరువురు నేతలూ తమ కార్యకర్తలను ఆలయానికి రావాలని పిలుపునిచ్చారు. దాంతో చెల్పూర్‌లో ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉందని గ్రహించిన పోలీసులు మంగళవారం ఉదయమే రంగ ప్రవేశం చేశారు. అక్కడ 144 సెక్షన్ అమలు చేశారు. హుజూరాబాద్, జమ్మికుంట రహదారిలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇరుపార్టీల కార్యకర్తలను ఎవ్వరినీ అక్కడికి రానీయ్యకుండా గుడి చుట్టూ పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ బొల్ల రమేష్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిని, కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబుతో సహా ఇరుపార్టీల నాయకులను వారి ఇండ్లలోనే హౌజ్ అరెస్టు చేశారు. ఈ దశలో కొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు మూకుమ్మడిగా చెల్పూర్ హనుమాన్ టెంపుల్ వైపు నినాదాలు చేసుకుంటూ వస్తుండగా వారిపై లాఠీచార్జి చేసి చెదరగొట్టారు.

ఇంట్లోనే తడిబట్టలతో ఎమ్మెల్యే ప్రమాణం

తాను ప్రమాణం చేసినట్టుగానే మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఆలయానికి వచ్చి దేవునిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు బుధవారం హైదరాబాద్‌లోని టిటిడి దేవస్థానానికి ఉదయం 11గంటలకు వస్తానని, మంత్రి పొన్నం వచ్చి తన నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

రాజ్యాంగ పరిరక్షణ అంటూనే.. ఫిరాయింపులా : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వైపు రాజ్యాంగ పరిరక్షణ అంటూనే మరోవైపు పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఎమర్జెన్సీ నాటి నుంచి ఇప్పటి వరకు నయవంచనకు ప్రతిరూపం కాంగ్రెస్ అంటూ ట్వీట్ చేశారు. పౌర, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల గొంతులను అణిచి వేస్తూ 49 ఏళ్ల క్రితం ఇదే రోజు కాంగ్రెస్ దేశంలో ఎమర్జెన్సీని విధించిందని గుర్తు చేశారు. ఇన్ని దశాబ్దాలు గడిచినా సరే ఆ పార్టీ ప్రజాస్వామ్యంపై అదే దాడిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ కాపీలను ఆ పార్టీ నేతలు చేత పట్టుకొని ప్రదర్శన చేస్తారని, మరోవైపు అదే పార్లమెంట్‌కు కొద్ది దూరంలోనే ఉన్న వాళ్ల పార్టీ ఆఫీస్‌లో రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసే విధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారని విమర్శించారు. ఏ రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారో...అదే రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బ తీసేలా వ్యవహరించే కాంగ్రెస్ హిపోక్రసీ చూస్తుంటే ఆవేదన కలుగుతోందని పేర్కొన్నారు.

ఓమ్ సంస్థపై ఇడి కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల నుంచి వచ్చిన విరాళాలు పక్కదారి పట్టించిన వ్యవహారంలో ఆపరేషన్ మొబిలిటి (ఓమ్)పై మనీలాండరింగ్ చట్టం కింద ఇడి కేసు నమోదు చేసింది. తెలంగాణ సిఐడిలో నమోదైన కేసు ఆధారంగా మరో కేసు నమోదు చేసిన ఇడి అధికారులు మొత్తం 11 చోట్ల సోదాలు నిర్వహించారు. ఓమ్ సహా ఇతర సంస్థల పేరుతో విదేశాలకు చెందిన దాతల నుంచి రూ.300 కోట్లు సేకరించినట్లు ఇడి గుర్తించింది. యుఎస్, కెనడా, యుకె, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, డెన్మార్క్, జర్మనీ, బ్రెజిల్, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, మలేసియా, రుమేనియా, సింగపూర్, నార్వే సహా పలు దేశాల నుంచి నిధులు సేకరించినట్టు తెలిపింది. సుమారు వంద పాఠశాలల్లో చదువుతున్న ఎస్సి, అనాథ పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తామని ఈ విరాళాలు సేకరించినట్టు ఇడి అధికారులు గుర్తించారు. విరాళాలను పక్కదారి పట్టించిన సదరు సంస్థ.. పాఠశాలల్లోని విద్యార్థుల వద్ద రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్టు సిఐడి అధికారులు గతంలో గుర్తించారు. విరాళాల ద్వారా ఓమ్ సంస్థ తెలంగాణ, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలో ఆస్తులు కొనుగోలు చేసినట్టు ఇడి అధికారుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో 11 చోట్ల రెండురోజులపాటు సోదాలు చేసిన ఇడి అధికారులు.. ఆస్తులకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు, బినామీ కంపెనీల లావాదేవీల వివరాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.



'రేపటి మైదానం' కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - కల్చరల్

'రేపటి మైదానం' కవితా సంపుటిలోని ప్రతి కవితా విఖ్యాత కవి గోపి అరవై దశాబ్దాల జీవన యానంలోని మైలురాళ్లు అని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరం కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విఖ్యాత కవి డాక్టర్ ఎన్.గోపి అమృతోత్సవంలో భాగంగా ఆయన రాసిన కవితా సంపుటి 'రేపటి మైదానం' ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ.. డాక్టర్ ఎన్.గోపి ఎందరో కవులకు ప్రేరణ ఇచ్చారని వివరించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. వేమన పద్యాలపై గోపి పరిశోధన, విశ్లేషణ చేసి నేటి తరం వారికి మార్గ నిర్దేశం చేశారనీ అన్నారు. గోపి తన సంపుటిని సుప్రసిద్ధ విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి అంకితం ఇచ్చారు. వేదికపై సాహితీవేత్తలు ఆచార్య సూర్య ధనంజయ జాతీన్ కుమార్, వంశీధర్ తదితరులు పాల్గొనగా కిన్నెర రఘురాం స్వాగతం పలికారు.



భాషా శాస్త్రవేత్త 'తిరుమల రామచంద్ర'

- ప్రముఖ సాహితీవేత్తలు

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు భాషలో మాండలికాలు, పద ప్రయోగాలలో గుణదోషాలపై సాధికార వ్యాసాలు రాసిన తిరుమల రామచంద్ర భాషా శాస్త్రవేత్త అని ప్రముఖ సాహితీ వేత్తలు ఆచార్య జయరాములు, జర్నలిస్టు జయసూర్య అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా తిరుమల రామచంద్ర యాదిలో కార్యక్రమం గాన సభ నిర్వహణ జరిగింది. జయ సూర్య మాట్లాడుతూ.. రామచంద్ర ఆంధ్రపత్రికలో ఎన్నో ప్రయోజనాత్మక వ్యాసాలు రాశారని వివరించారు. ఆచార్య జయరాములు భాషా శాస్త్ర పరిశోధనలో అగ్రగణ్యులు రామచంద్ర అని వారి రచనలు అందుబాటులోకి తేవాలని సూచించారు. గాన సభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై పాలక వర్గ సభ్యులు గుండవారపు గీతా దేవి పాల్గొన్నారు.

కెసిఆర్ మీటింగ్‌కు మహిపాల్‌రెడ్డి డుమ్మా

- ఢిల్లీల్లో కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు
- కారు దిగి కాంగ్రెస్‌లో చేరే ఛాన్స్
- ఆ నలుగురి చూపు కాంగ్రెస్ వైపే
- ఉమ్మడి మెదక్ జిల్లాలో మిగిలేది మామ అల్లుడే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గులాబీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జంపు జిలానీ అంటూ పార్టీ మారుతున్న నేపథ్యంలో పార్టీని రక్షించుకునేందుకు సమాలోచనలు జరిపేందుకు కెసిఆర్ నిర్వహించిన కీలక సమావేశానికి పలువురు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. మాజీ సిఎం, గులాబీ పార్టీ అధినేత కెసిఆర్ మంగళవారం సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఎంతో కీలకమైన సమావేశానికి బిఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రం హాజరుకాలేదు. పార్లమెంట్ ఎన్నికల ముందు పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో కొందరు, బిజెపిలో మరి కొందరు చేరారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కెసిఆర్ నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కూడా పార్టీ ఫిరాయింపులు ఆగట్లేదు. ఇటీవల బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సంజయ్ ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. గైరాజరైన ఐదుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ దానం నాగేందర్ ప్రకటించిన పేర్లే కావడం విశేషం.

ఢిల్లీలో గూడెం మకాం


బిఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. కారు దిగి హస్తం పార్టీ చెంతకు చేరేందుకు ఢిల్లీలో మకాం వేసి కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపిల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు కూడా ఢిల్లీ వెళ్లారు. అయితే గూడెం మహిపాల్‌రెడ్డి మాత్రం తన వ్యక్తిగత విషయాల గురించే ఢిల్లీకి వెళ్లినట్లు చెబుతున్నారు. కాగా, అక్రమ మైనింగ్ కేసులో రూ.300 కోట్ల వరకు అవినీతి జరిగినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ కేసులో గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి అరెస్టయి జైలుకు వెళ్లారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైనా మళ్లీ జైలుకెళ్లడం తప్పదంటున్నారు. ఇదే కేసులో ఎమ్మెల్యే పేరు కూడా ఉంది. దాంతో పాటు ఇటీవల ఈడీ సైతం గూడెం సోదరుల అక్రమ మైనింగ్ విషయంలో దాడులు చేసింది. ఏకకాలంలో ఎనిమిది చోట్ల సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు పలు డ్యాక్యుమెంట్లు, హార్డ్‌డిస్క్‌ల్ని స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అధికారులు ఏకకాలంలో విచారణలు జరపడంతో ఏం చేయాలో పోలుపోని పరిస్థితుల్లో గూడెం బ్రదర్స్ పార్టీ మారేందుకు సిద్ధమైనట్టు ఆయన సన్నిహితులు తెలుపుతున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుకు అత్యంత సన్నిహితుడు కావడమే కాకుండా ఆయన బినామీగా కూడా ప్రచారముంది. ఇడి దాడులకు దిగడంతో బీజేపీ నేతల నుంచి కూడా ఒత్తిడి ఉన్నట్టు చెబుతున్నారు.

మిగిలేది కెసిఆర్, హరీశ్‌రావు ఇద్దరే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలోని బిఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం సిఎంను కలిశామని చెప్పినా పొలిటికల్ నిర్ణయం కోసమే అప్పట్లో సిఎంను కలిశారనే చర్చ జరిగింది. సీఎంను కలిసి వారిలో కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్యం, చింత ప్రభాకర్ ఉన్నారు. ఇప్పటికే గూడెం మహిపాల్‌రెడ్డి దాదాపు కాంగ్రెస్‌కు దగ్గరైనట్టు చెబుతున్నారు. ఇక మిగిలిన నలుగురు సైతం అటు ఇటు అయినా కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమంటున్నారు. సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డికి సంబంధించి ట్రావెల్స్, ఇతర వ్యాపారాలున్నాయి. సునీతకు సంబంధించి భూములు, ఆస్తుల వ్యవహారాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఇబ్బందులు పెట్టే అవకాశముందంటున్నారు. ఇప్పటికే మహిపాల్‌రెడ్డిని టార్గెట్ చేశారు. అలాగే సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు ప్రభాకర్, మాణిక్యం సైతం నియోజకవర్గంలో ఏ చిన్న పని కూడా చేయలేని పరిస్థితిల్లో ఉన్నందున కాంగ్రెస్‌లో చేరడమే మేలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలుండగా.. వీరిలో కెసిఆర్, హరీశ్‌రావు తప్ప మిగతా వాళ్లంతా పార్టీని వీడి హస్తం చెంతకు చేరుతారనే ప్రచారం సాగుతోంది. హరీశ్‌రావుకు సన్నిహితులైప్పటికీ వ్యాపారాలు, ఆస్తుల్ని రక్షించుకునేందుకు పార్టీ మారడం తప్పని పరిస్థితి.

కెసిఆర్ మీటింగ్‌కు ఐదుగురు ఎమ్మెల్యేల డుమ్మా

పార్టీని రక్షించుకునేందుకు కెసిఆర్ నిర్వహించిన కీలక సమావేశానికి పలువురు ఆ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో పాటు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఉన్నారు. గూడెం మహిపాల్‌రెడ్డి ఢిల్లీలో ఉన్నారు. మిగతా నలుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరందరూ కాంగ్రెస్‌లో చేరుతున్నట్లుగా ఇటీవల దానం నాగేందర్ ప్రకటించారు. ఐదుగురు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకే కేసీఆర్ సమావేశానికి హాజరుకాలేదా..? లేక మరేవైనా కారణాలున్నాయా..? అనేది చర్చనీయాంశమైంది. ఎక్కువ మంది కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

లీకేజీలతో దేశ ప్రతిష్టకు భంగం

- ఎన్‌టిఎను రద్దు చేయాలి
- నేడు రాష్ట్రవ్యాప్తంగా మోడీ దిష్టిబొమ్మల దగ్ధం
- విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ సమితి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో దేశ ప్రతిష్టకు భంగం కలుగుతున్నదని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి విమర్శించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) డైరెక్టర్‌ను మార్చడం కాకుండా ఆ సంస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేసింది. నీట్ నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకే అప్పగించాలని కోరింది. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలనీ, ఆ రాతపరీక్షలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చేపడతామని పిలుపునిచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్‌కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆ సమితి నాయకులు అభిజిత్ యాదవ్ (ఎన్ఎస్‌యూఐ), అశోక్‌రెడ్డి (ఎస్ఎఫ్ఐ), శ్రీను (పిడిఎస్‌యు), కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ (డివైఎఫ్ఐ), కె ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్ (ఎఐవైఎఫ్), కెఎస్ ప్రదీప్ (పివైఎల్), ఎస్‌కె సలీంపాషా (వైజెఎస్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అయి విద్యార్థులు నష్టపోయినా ప్రధాని మోడీ నోరుమెదపడం లేదని విమర్శించారు. అమ్మకానికి ప్రశ్నాపత్రాలుండడం సిగ్గుచేటని అన్నారు. నీట్ ప్రశ్నాపత్రాన్ని అంగట్లో సరుకుగా బిజెపి ప్రభుత్వం మార్చిందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నిర్లక్ష్య వైఖరిని వీడాలనీ, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యుజిసి నెట్ రద్దుకు బాధ్యత వహించి అభ్యర్థుల దగ్గర వసూలు చేసిన దరఖాస్తు ఫీజును తిరిగి చెల్లించాలని కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహించి దేశ ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు శ్రీకర్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, పిడిఎస్‌యు నాయకులు గౌతమ్, అనిల్, విజెఎస్ నాయకులు వీరన్న, ఎఐవైఎఫ్ నాయకులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హష్మీబాబు, ఎండీ జావెద్, పీవైఎల్ నాయకులు బిఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.